# అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ పాలన

- 'సీతారామ'కు నీటి కేటాయింపులు లేవనడం విడ్డూరం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్ మే 12 (నమస్తే తెలంగాణ): అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే అబద్ధాల పునాదులపై పాలన సాగిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. నిజం మౌనంగా ఉంటే అబద్ధమే రాజ్యమేలుతుందనే సామెత కాంగ్రెస్ సర్కారుకు అతికినట్టు సరిపోతుందని ఎక్స్ వేదికగా దుయ్యబట్టారు. సీతారామ ప్రాజెక్టుకు అనుమతులు లేవని, నీటి కేటాయింపులు జరగలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదమని పేర్కొన్నారు. కాంగ్రెస్ చెప్పిన ప్రతి అబద్ధానికి ఆధారాలు సహా నిజాలను ప్రజల ముందుంచడం బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. 2018 అక్టోబర్ 30న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర జల సంఘానికి అందించిందని పేర్కొన్నారు. 2021 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 113.795 టీఎంసీల నీళ్ల ప్రతిపాదిత సీతారామ ప్రాజెక్టుకు అందుబాటులో ఉన్నాయని సీడబ్ల్యూసీ హైడ్రాలజీ డిపార్ట్‌మెంట్ నిర్ధారించిందని వివరించారు. ఈ ప్రాజెక్ట్ కింద 70.04 టీఎంసీల నీటిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు వాడుకోవచ్చని కేంద్రం 2021లో నిర్ధారించిందని గుర్తుచేశారు. ఇంత స్పష్టంగా సీడబ్ల్యూసీ, హైడ్రాలజికల్ అనుమతులు ఉన్న ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పడం అబద్ధాలకు పరాకాష్ట అని హరీశ్‌రావు అభివర్ణించారు. తెలంగాణకు కేటాయించిన కృష్ణా నీటిని వాడుకునే తెలివిలేక ఏపీకి అప్పగించి పెదవులు మూసుకున్న ఘనత కాంగ్రెస్ నాయకులకే దక్కిందని ఎద్దేవా చేశారు. ఏడాదిన్నర పాలనలో ఎకరాకు నీళ్లివ్వలేని ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ సాధించిన సాగునీటి విజయాలను తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. అబద్ధాన్ని వందసార్లు చెప్తే, నిజమవుతుందనే భ్రమలో మంత్రి ఉత్తమ్ ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణకు చేసిన అన్యాయాలు మరిచిపోయారా? ఆంధ్రా ప్రయోజనాల కోసం రాజీవ్, ఇందిరాసాగర్ నిర్మాణాలు చేపట్టింది వాస్తవం కాదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇప్పటికైనా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు.

# సర్కార్ కక్ష.. అభ్యర్థులకు శిక్ష!

- ఫిబ్రవరిలో ఏఈ, జేటీవో ఫలితాల వెల్లడి
- నియామకపత్రాలు ఇవ్వడంలో కాంగ్రెస్ సర్కారు తాత్సారం
- వాయిదాలు వేస్తూ వస్తున్న ప్రభుత్వం
- ప్రతిపక్షాన్ని ఎలా కలిశారని ప్రభుత్వ పెద్దల ఆగ్రహం
- అపాయింట్‌మెంట్లు ఇవ్వడంలో రేవంత్ సర్కారు కాలయాపన

హైదరాబాద్, మే12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ పెద్దల కక్షకు, ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు శిక్ష అనుభవిస్తున్నారు. నెలలు గడిచినా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. రేపు, మాపు అంటూ తాత్సారం చేస్తున్నారు. గట్టిగా నిలదీస్తే అసలు ఇచ్చేదే లేదంటూ ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారని ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్లు), జేటీవో (జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు)లుగా ఎంపికైన బాధిత అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర విభాగాల్లో దాదాపు 833 ఏఈ, జేటీవో పోస్టుల భర్తీకి 2022లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. అందులో నీటి పారుదలశాఖకు 439 పోస్టులు ఉన్నాయి. గత అక్టోబర్‌లో రాత పరీక్ష నిర్వహించగా, ఫిబ్రవరిలోనే ఫలితాలు వెల్లడించారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లను అందుకుని విధుల్లో చేరేందుకు వారంతా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కానీ ముఖ్యమంత్రే రావాలి? ఆయనే నియామకపత్రాలివ్వాలి అంటూ ఆ తంతును సర్కారు నిర్వహించడమే లేదు. తొలుత ఏప్రిల్ 14న, ఆ తర్వాత 28, మే 2, అదే నెల 7వ తేదీన అని వాయిదాలు వేస్తూ వస్తున్నారు. నియామకపత్రాల పంపిణీ కోసం జలసౌధ ప్రాంగణంలో టెంట్లను కూడా ఏప్రిల్ 28నే వేశారు. ఇప్పటికీ అవి అలాగే ఉన్నాయి. కానీ కార్యక్రమ తేదీ మాత్రం నిర్ణయించడం లేదు. ఇదేమని ఉన్నతాధికారులను అడిగితే సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, ఈ నేపథ్యంలోనే వాయిదా వేస్తున్నట్టు తమ అశక్తతను వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, గ్రౌండ్‌వాటర్ తదితర విభాగాలకు తమతోపాటు ఎంపికైన వారు ఇప్పటికే విధుల్లో చేరి వేతనాలను కూడా పొందుతున్నారని ఏఈ, జేటీవోలుగా ఎంపికైన అభ్యర్థులు వాపోతున్నారు.

## సర్కార్‌ను నిలదీసిన హరీశ్‌రావు



నీటిపారుదల శాఖలో ఏఈ, జేటీవోలుగా ఎంపికైన వారికి నియామకపత్రాలు ఇవ్వకపోడంపై బీఆర్ఎస్ తరఫున మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వడానికి కూడా సమయం దొరకడం లేదా? అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని నిలదీశారు. ఇదే ప్రభుత్వ పెద్దలకు చిర్రెత్తుకొచ్చినట్టుగా అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ కారణంగా నియామకపత్రాలు ఇవ్వకుండా మరోవిధంగా కక్షసాధింపు మొదలు పెట్టారని ఆరోపిస్తున్నారు. అభ్యర్థులపైనే ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టుగా తెలుస్తున్నది. నియామకపత్రాలు ఇవ్వకుంటే ప్రతిపక్ష నేతలతో ఎలా మాట్లాడిస్తారు? అంటూ అభ్యర్థులపైనే మండిపడుతున్నారు. వారు మాట్లాడితే పత్రాలు ఇచ్చేదే లేదంటూ ఏకంగా బెదిరింపులకు దిగుతున్నారని అభ్యర్థులు చెప్తున్నారు. ఇప్పటికైనా తమకు పత్రాలను అందించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

# నేడే పాలిసెట్ పరీక్ష

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్(డిప్లొమా) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీజీ పాలిసెట్-25 ప్రవేశ పరీక్ష మంగళవారం జరగనున్నది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు ఓఎమ్మార్ పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షను నిర్వహిస్తారు. 276 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,06,716 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.






# 25 మంది మావోయిస్టులు మృతి?

## ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 12 : భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన భీకర పోరులో 25 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు తెలుస్తున్నది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర రాష్ట్రాల సరిహద్దుల్లో సోమవారం చోటుచేసుకున్నది. వివరాలు ఇలా.. మహారాష్ట్ర రాష్ట్రం గడ్చిరోలి జిల్లా భామ్రగఢ్ దళానికి చెందిన మావోయిస్టులు కన్వాడే పోలీస్‌స్టేషన్ పరిధి ఫుట్ ఓవర్‌బ్రిడ్జ్ వద్ద క్యాంపు నిర్వహించినట్టు పోలీస్ వర్గాలకు సమాచారం అందింది. దీంతో అదనపు ఎస్పీ ఎం రమేశ్ నేతృత్వంలో 200 మంది సీ-60 భద్రతా దళాలు ఆదివారం రాత్రి నుంచి సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశా యి. సోమవారం ఉదయం జవాన్లకు మావోయిస్టులు తారసపడి కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు ప్రారంభించారు. ఇరువర్గాల మధ్య విడతలవారీగా భీకర కాల్పులు జరిగినట్టు తెలుస్తున్నది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమం లో ఘటనా స్థలం నుంచి ఒక ఇన్‌సాస్ రైఫిల్, ఒక సింగిల్ షాట్ రైఫిల్, ఒక మ్యాగజైన్, లైవ్ రౌండ్లు, డిటోనేటర్లు, ఒక రేడియోతోపాటు పెద్ద ఎత్తున మావోయిస్టులకు సంబంధించిన ఇతర ఆయుధ, వస్తు సామగ్రిని జవాన్లు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాక ఆ ప్రాంతంలోని మావోయిస్టుల స్థావరాలను బలగాలు ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో సుమారు 25 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు సమాచారం. మృతుల వివరాలను అధికారులు ధ్రువీకరించాల్సి ఉన్నది.

# వారంలో ఈసెట్ ఫలితాలు

## సజావుగా పరీక్ష .. 96% విద్యార్థుల హాజరు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : పాలిటెక్నిక్ కోర్సు పూర్తిచేసిన వారికి బీటెక్ సెకండియర్‌లో ప్రవేశాలు కల్పించేందుకు నిర్వహించే టీజీ ఈసెట్ పరీక్ష ఫలితాలు వారం రోజుల్లో విడుదలకానున్నాయి. ఈ నెల 20లోపు ఫలితాలు విడుదల చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు భావిస్తున్నారు. ఈసెట్ పరీక్షను సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించారు. 86 పరీక్ష కేంద్రాల్లో 19,672 మందికి 18,928 మంది (96.22%) విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ఉస్మానియా వీసీ ప్రొఫెసర్ కుమార్, ఈసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. తొలుత ప్రాథమిక కీ, విద్యార్థుల రెస్పాన్స్ షీట్లను విడుదల చేసి, అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆ తర్వాత ఫైనల్ 'కీ'ని విడుదల చేసి ఫలితాలు ప్రకటిస్తారు.

# సీపీఎస్‌ను రద్దుచేయాలి: తపస్

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్‌ను అమలుచేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) డిమాండ్ చేసింది. 2002, 2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్‌ను వర్తింపజేయాలని సర్కారును కోరింది. ఉద్యోగ సమస్యల పరిష్కారానికి నియమించిన త్రిసభ్య కమిటీ చైర్మన్ నవీన్ మిట్టల్‌ను తపస్ ప్రతినిధి బృందం సోమవారం కలిసి పలు అంశాలపై వినతిపత్రాన్ని సమర్పించింది. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు తక్షణమే చెల్లించాలని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ కోరారు. పాఠశాల విద్యలో డిటెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ అడ్మిట్‌కార్డుల విడుదల

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ) : ఐఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ అడ్మిట్‌కార్డులు విడుదలయ్యాయి. ఐఐటీ కాన్పూర్ ఈ అడ్మిట్‌కార్డులను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను 18న జాతీయంగా నిర్వహించనున్నది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పేపర్-1, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్-2కు పరీక్షలు నిర్వహిస్తారు. 2.5 లక్షలకు పైగా విద్యార్థులు హాజరుకానున్నారు.

## ఏసీబీ వలలో సూర్యాపేట డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్



సూర్యాపేట, మే 12 (నమస్తే తెలంగాణ): సూర్యాపేట డీఎస్పీ, పట్టణ ఇన్‌స్పెక్టర్ అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేటలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ స్కానింగ్ సెంటర్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కేసు లేకుండా చేయడానికి స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడిని సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి, పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు రూ.25 లక్షలు డిమాండ్ చేయగా రూ.16 లక్షలకు ఒప్పందం కుదిరింది. స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ నేతృత్వంలోని బృందం ఫోన్ కాల్ రికార్డింగ్ ఆధారంగా డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిని నాంపల్లి కోర్టులో రిమాండ్ చేయనున్నట్టు అధికారులు తెలిపారు.

# డిగ్రీ ఎగ్జామ్స్ సస్పెన్స్‌కు తెర

- సమ్మె విరమించిన కాలేజీల యాజమాన్యాలు
- 40 రోజుల సందిగ్ధతకు ముగింపు

హైదరాబాద్, మే 12 (నమస్తే తెలంగాణ): డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయా..? లేదా..? అన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. కాలేజీల యాజమాన్యాలతో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి చర్చలు జరపడం, ఇవి ఫలప్రదం కావడంతో పరీక్షలకు మార్గం సుగమమయ్యింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ కాలేజీల యాజమాన్యాలు 40రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నాయి. ఈ నెల 14 నుంచి శాతవాహన, మహాత్మాగాంధీ, కాకతీయ వర్సిటీల్లో డిగ్రీ పరీక్షలు జరగాల్సి ఉంది. 15 నుంచి పాలమూరు, 16 నుంచి తెలంగాణ వర్సిటీలో పరీక్షలు జరగాల్సి ఉంది. ఒకవైపు కాలేజీ యాజమాన్యాలు సమ్మెకు దిగడం, బుధవారం నుంచి పలు వర్సిటీల్లో పరీక్షలు జరగాల్సి ఉండటంతో ఈ పరీక్షలు జరిగేనా..? అన్న అనుమానాలు తలెత్తాయి. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సోమవారం తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) నేతలతో చర్చలు జరిపారు. ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు అసోసియేషన్ నేతలకు తెలిపారు. రూ. 250-300 కోట్ల బకాయిల విడుదలకు సీఎం హామీ ఇచ్చినట్టు బాలకిష్టారెడ్డి వివరించారు. సమ్మెను విరమించాలని కోరారు. దీంతో కాలేజీల యాజమాన్యాలు సమ్మె విరమిస్తున్నట్టు ప్రకటించాయి.











